కథ

# చెట్టంత మనిషి

పూసపాటి రాజ్యలక్ష్మి

నమస్తే మేడమ్. నేను మస్తాన్‌ను మాట్లాడుతున్నాను. చంద్రగిరిలో ఒక మంచి రైతు పరిచయం అయ్యాడు. అతనికి పాతిక ఎకరాల పొలం వుంది. మంచిగా సేద్యం చేస్తాడు. అతను మన పట్టుపరిశ్రమ చేపట్టడానికి ఉత్సాహంగా వున్నాడు. రేపు మీరు వచ్చి అతనని కలిసి మాట్లాడితే మన పంట మీద నమ్మకం కలుగుతుంది.

- 0 -

నాదగ్గర పని చేసే మస్తాన్ ఎద్దులకు స్నానం చేయిస్తున్న చెన్నారెడ్డిని పరిచయం చేసాడు.

చేతిలోని చుట్టను మర్యాదపూర్వకంగా నలిపి ప్రక్కన పడేసి నమస్కారం చేస్తూ ముఖం, నోరు కడుక్కుని భుజం మీద కండువా తీసి ముఖం తుడుచుకుంటూ

ఎంత పొద్దుకాడ వచ్చింద్రి అమ్మా రండి కూర్చోండి అంటూ మంచం చూపిస్తూ ఒరేయ్ పట్నం నుండి అమ్మగారు వచ్చారు మంచి చిక్కని కాఫి ఎత్తుకురండి.

ఏమ్మా చెప్పండి. మీరు వస్తున్నారని రాత్రి మస్తాన్ ఫోను చేసి చెప్పాడు. ఎంక పెందలకాడ వచ్చావు కల్సి. నీవు యిట్టా తెల్లారి పొద్దుగానే ఉద్యోగానికి వస్తే యింట్లో ఎలా చేస్తావు కల్సి. నీ పిల్లలు యిబ్బంది పదరా.

తప్పుదుకదండి. పల్లెల్లో రైతును కలవాలంటే ఉదయం రాత్రే కదా దొరికేది. మిగతా టైము మీరు ఏ పొలాల్లో సేద్యం చేస్తుంటారో, దొరకరు కదా. అలాగే యిద్దరం సంపాదిస్తే గాని యిల్లు గడవదు. హాయిగా నాక్కూడా మీలాగ పొలం వుంటే పదిమందిచేత పని చేయించుకుంటూ ఈ చెట్లల్లో చేమల్లో సంతోషంగా వుండేదానను.

ఎందుకులేమ్మా. చదువుకున్నోళ్ళు ఈ పనిచేయలేరు. మా కంటారా మొదటి కాడనుండీ ఈ మట్టిలో పుట్టి పెరిగినోళ్ళము. మా అబ్బాయి కూడా ఇంజనీరు చదివి ఈ పొలం అమ్మి తన దగ్గరకు రమ్మన్నాడు. నేను రానని చెప్పినా. మద్రాసు పోయి ఉద్యోంలో చేరి అయిదు సంవత్సరాలు పని చేసినాడు. మరి అక్కడ ఏమయినాదో ఏమో నాకు తెలియదు. ఉద్యోగం మాని ఈడకు వచ్చిండు. కాని కాపురంమాత్రం పట్నంలో పెట్టిండు. ఉద్యోగస్తుడిలా ఉదయం వచ్చి రేతిరికి యింటికి పోతాడు. ఇలా చేస్తే ఏనాటికి ఈపొలం పనులు చేయాలి. ఎప్పుడు ఈ మట్టిని కనిపెట్టుకుంటేనే సేద్యం జరిగేది. అయినా మీకెందుకులే చదువుకున్నోళ్ళకు సేద్యం పనులు.

ఆయన మాట్లాడుతూ వుంటే చుట్టూ పరిసరాలు గమనిస్తూనే వున్నాను. వంద అడుగుల షెడ్‌లో పాతిక గేదెలు. ఎంత నీటుగా వుంది షెడ్డు. అద్దె మాఎదురింటి లక్ష్మమ్మ ఒక గేదెను పెట్టుకొని పాలు అమ్ముకొని యింటికి కొంత ఆసరాగా వుంటుంది. కాని గేదె లక్ష్మమ్మదనే మాటేగాని, బజారంతా ఆ గేదెదే. ఎక్కడపడితే అక్కడ మా వీధిలో కట్టేస్తుంది. ఎక్కడ వేసిన పేడ అక్కడే వుండవలసిందే. ఆ గేదె మూలాన అందరికి ఈగలు, దోమలు. పాలు పితుక్కోవడం తెలుసుగాని దాన్ని మెయిన్‌టెయిన్ చేయదు. గేదె గురించి ఎవరన్నా ఏమయినా అంటే యిక యింతే సంగతులు. వాళ్ళపని అయిపోయినట్టే. ఇంత నోరు జేసుకొని మీకేం మాయరోగం హాయిగా గవర్నమెంటు సొమ్ము తింటున్నారు. నేను కాయ కష్టం చేసుకొని బ్రతుకుతున్నాను. అందరికి నా మీదే ఏడుపు. ఈ పట్నంలో కాపరాలు వుండటానికీ జాగలేదు మరి నా గేదెను యాడ కట్టేసుకోవాలి. అంత బాధగా వుంటే కొంచెం జాగా చూపించండి, ఆడే కట్టేసుకుంటాను. నేను ఇంతె ఏం జేసుకుంటారో జేసుకోండి. నేను పాలు పోయటం ఆలస్యం అయితే కాఫీ కోసం నాలుక యింత బయటకు వస్తాది. కాని నా గేదె మాత్రం వీళ్ళకు పడిచావదు అంటుంది. అలాంటిది పాతిక పాడి గేదెలను సాకటం ఆషామాషి కాదు. అయినా చుట్టూ ఎంత పరిశుభ్రంగా వున్నదో! హాయిగా మంచం వేసుకొని అన్నం గూడ తినొచ్చు.

అప్పుడే స్నానం చేయించినట్టు వున్నారు. నల్లగా నిగనిగలాడుతూ తలలు వూపుకుంటూ గాడిలోని పచ్చగడ్డిని మేస్తుంటే, పసిబిడ్డను స్నానం చేయించి శుభ్రంగా తుడిచి పౌదరు రాసి ఉయ్యాలలో వేసిన బిడ్డను చూస్తే తల్లికి ఎంత సంతోషం కలుగుతుందో అలా అనిపించింది వాటిని చూస్తుంటే. ఇంకొంచెం దూరంలో అయిదు జతల ఎద్దులకు నాగళ్ళు కట్టి సేద్యానికి సిద్ధం చేస్తున్న పనోళ్ళు. ఇంకొంత దూరంలో ట్రాక్టరు, ఎడమ ప్రక్క బయోగ్యాస్ ప్లాంటు. నా మంచం చుట్టూ గోలగోల చేస్తున్న కోళ్లు. బోర్లల్లోనుండి జల సంగీతం. ముక్కు పుటాలు అదిరి పోయేట్టు గోంగూర ఉడుకు వాసన.

ఆ వాసనకు ఎప్పుడూ పచ్చడినూరి వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకొని తిందామా అన్న కోరికతో నోట్లో లాలాజలం.

ఇంతలో పొగలు కక్కుతూ కాఫీ వచ్చింది. నేను వండర్ అయ్యాను. ఇన్‌స్టెంటు కాఫీని చూసి, కాఫీ డికాషిన్‌తో నల్లగావుండి సగం కాఫి పొడితో వస్తామనుకొని మనస్సులో అనుకొని ఆ మాటపైకి అనేసాను.

లేదమ్మా మా కుర్రోళ్ళకు అన్ని ఫ్యాషన్లు తెలుసు. ఈడ సరిగా పనోళ్ళు దొరకరు అందుకని బీహారు నుండి తీసుకొచ్చి ఈడనే రూములు కట్టించి యిచ్చినా. బాగా కష్టం చేస్తారు. మాతో యింట్లో మనుషుల్లాగా కలిసి పోయారు. బాగా నమ్మకస్తులు. ఈ తూరి మీరు వస్తే పలావు బాగా చేస్తారు. తిందురు గాని.

మామా గడ్డి కోసుకుంటామని నలుగురు ఆడోళ్ళు వచ్చారు.

ఒసే మల్లి నిన్న ఏడ గడ్డికోసినారే. కాలవ గట్టును తొక్కినారు. నీళ్ళు దారి మళ్ళి సజ్జతోటలోకి పోయి బురద బురద అయినాది. కోత కొచ్చిన పైరును రేపు కోయిద్దామనుకుంటే బురదలో ఎట్లాగనే కోయించేది. ఆ బురద ఆరటానికి వారం రోజులు పడుతుంది. యిట్టజేస్తే ఎలాగే? వద్దు అంటే మూతి ముడుచుకొని చెన్నయ్య మామ మంచోడు కాదని వూళ్ళో చెబుతారు. ఎట్టా చావాలే మీతో. ఇంకో పది రోజులదాక దక్షిణం ప్రక్క పొలంలోనే కోసుకోండి.

చెప్పమ్మా. యిలా మాట్లాడుతుంటే సాయంత్రం అవుతాది. మీరు పట్టు పరిశ్రమ గురించి బాగా చెబుతారని ఈ మస్తాను చెప్పాడు. మాకా కొత్త. ఈ పంటను ఎప్పుడు చూడనూలేదు. చెయ్యనూలేదు.

ఫరవాలేదు యిది రైతుకు మంచిపంట. మీలాంటి మంచి రైతులు కష్టపడి చేసుకుంటే సిరులపంట. డబ్బుబాగా వస్తుంది. మీకు తెలుసుకదా మన యిండ్లలో ఏ శుభకార్యం జరిగినా నగలు తరువాత పట్టుబట్టలకు ప్రాధాన్యత యిస్తాము. మరీ మా ఆడవాళ్ళము ఒంటికి నిండుగా పట్టుచీర లేనిది ఏ ఫంక్షన్‌కు వెళ్ళ బుద్దికాదు. అంత విలువైన పట్టు మీలాంటి రైతు చెమట నుండి వచ్చినదే. ఈ పంట చాలా సులువు. ఒక పట్టుచీర తయారు కావాలంటే దాదాపు పాతిక మంది కూలీలు కష్టపడాలి. పట్టుపురుగు త్యాగం విలువ పట్టుచీరలో కనబడుతుంది. మీరు చేయవలసింది, ఒక ఎకరం తోటలో పట్టుపురుగు తినే ఆహారం అయిన మల్బరి ఆకును తోటలో పెంచాలి. తరువాత పట్టు గ్రుడ్ల నుండి వచ్చిన పురుగులను వీటికోసం ప్రత్యేకంగా కట్టించిన షెడ్లలో మల్బరి ఆకును వేసి పెంచాలి. అలా యిరువది రోజులు ఆకును మేసిన పురుగులు పట్టుకాయలు కడతాయి. ఎలాగంటే ఆ పురుగులు నోటినుండి వచ్చే లాలాజలంతో తమ చుట్టూ తాము గూడును కట్టుకొని పదిరోజుల తరువాత రెక్కల పురుగుగా బయటకు వస్తాయి. గూడు కట్టుకున్న పురుగులను మీరు అమ్ముకోవాలి.

మరిదారం ఎలా వస్తుందమ్మా.

మీ దగ్గర కొన్ని పట్టుకాయలను వేడి నీళ్ళలోగాని, కరెంటు ద్వారాగాని, నీటి ఆవిరితో గాని పట్టుదారం దెబ్బతినకుండా లోపలి పురుగును చంపివేస్తారు. తరువాత వేడినీటిలో పట్టుకాయలను ఉడికించి మిషన్ల ద్వారా దారం వేస్తారు. అలా వచ్చిన ముడి పట్టుదారం రకరకాల ప్రక్రియల ద్వారా పట్టుచీర తయారు అవుతుంది.

మాటలమధ్యలో అయ్యా వూరికాడనుంచి అబ్బాయి వచ్చాడు. సరేలేరా! వాడిని బ్యాంకుకు పోయి డబ్బులు తీసుకొని రమ్మను. దసరా పండగకి మన పనోళ్ళకు, యింట్లోని వాళ్ళకు బట్టలు తేవాలి.

చెన్నారెడ్డిగారు, ఈ సంవత్సరానికి మామూలు బట్టలు తీయండి మా పట్టు పరిశ్రమ చేపడితే వచ్చే సంవత్సరం అందరికి పట్టు బట్టలు తీయచ్చు.



తూ.గో.జిల్లా, రామచంద్రాపురం, డా॥ చెలికాని రామారావు భవనంలో ఆర్.ఐ. ఐడియోలాజికల్ అండ్ ఫిలసాఫికల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డా॥ ఆవంత్స సోమసుందర్ అభినందన సభ జరిగింది. సభలో సొసైటీ కార్యదర్శి డా॥ చెలికాని స్టాలిన్, పలు యూనియన్ల నాయకులు, కళాకారులు ఆయనను ఘనంగా సత్కరించారు.

భలే చెప్పావమ్మా. ఏదో ఉన్న దాంట్లు ఏదో నలుగురికి సాయం చేద్దామని ఆలోచన. అంతేగాని మరీ అంత ఆశ పడకూడదులే తల్లి.

నీకయితే ఆశలేదుగాని ఈ పొలం మీదచాలా మందికి చానా ఆశ వుంది కదా పెద్దయ్యా అంటూ నాయుడు వచ్చి మా సంభాషణలో చేరిపోయాడు.

నేను ఒక మాట అడుగుతాను. మీ కొడుకు మీ దగ్గర వుండచ్చుకదా.

వచ్చిన నాయుడు కల్పించుకొని పెద్దయ్య కాడికి వాళ్ళు రారు. పెద్దయ్య అడికిపోతే చేతికి చిప్పేగతి. ఆ అమ్మ కాలుక్రింద పెట్టదు. కార్లలో తిరగాల. పొలం కాడికి వస్తే కాళ్ళకు మట్టి అంటుద్దట.

ఈ గొడ్లు గేదెలు అసలు పడవు. అందుకని పొలం అమ్ముకొని ఆడ పెద్ద మంచి అపార్టుమెంటు కొనుక్కోని మిగిలిన డబ్బులు బ్యాంకులో వేసుకోని వచ్చిన వడ్డీతో ఏదైనా వ్యాపారం చేసుకొని హాయిగా కాలుమీద కాలు వేసుకొని బతుకుతారట. కాయ కష్టం చేసుకోవలసిన ఖర్మ పట్టలేదట. రోజూరేత్రి అయిందంటే మొగుడు పెళ్ళాం చిలకా గోరింకల్లా వుండచ్చు కదా పొలం అమ్మాలని రోజూ గోడవేనట. మా పెద్దమ్మ ఎందుకు చచ్చిందనుకుంటున్నారు. ఏ జబ్బులేదు. మనోయాదితో మంచం పట్టి చచ్చిపోయింది. పెద్దయ్యను ఒప్పించి పొలం అమ్మాలని ఆమెను బాగా సతాయించారు. పొలం అమ్మమని మొహానజెప్పింది. ఆమెను బాగా హింస పెట్టినారు. చచ్చేముందు అమ్మా నీవు పొలం అమ్మబాక. ఈ భూమి మనలను యిప్పటిదాకా బతికించింది. పిల్లల చేతుల్లో పెట్టమాక అంటుండేది. మా పెద్దయ్యకు చెబితే అర్థం కాదు. మా పెద్దయ్యకు తెలియకుండా కొడుకు నాలుగు ఎకరాలు బ్యాంకులో పెట్టి కారు కొన్నాడు. అల్లుడిని చూస్తే పెద్దయ్య యిచ్చిన కట్నం తోను అతని వాటాగా వచ్చిన పొలం అమ్ముకొని ఫైనాన్స్ పెట్టినాడు. రేపో ఎల్లుండి బోర్డు తిప్పుతాడు. జనాలు అతన్ని ఖచ్చితంగా వీధిలోకి లాగుతారు. ఆ కూతురికి కూడా ఆశ ఎక్కువ. పెద్దయ్య, పెద్దమ్మ బుద్దులు పిల్లలకు రాలేదు. నాలుగు రోజులు పెద్దయ్యకు ఒంట్లో బాగా లేకపోతే ఎవ్వరూ వచ్చి చూడలేదు ఎందుకో ఈ పనోళ్ళే కంటికి రెప్పల్లా చూసు కున్నారు. ఏ కాడికి ఈ ముసలాడు పోతే మొత్తం అమ్ముకొని తిందామని వున్నారు.

సరేలేరా . నేను సచ్చిన తరువాత ఏమైతే నాకేంటి. నీవు సచ్చిందాక ఎందుకు. సాగరు కాలువ వచ్చిన కాడ నుండి నీళ్ళు బాగా వున్నాయి. బోర్లలో మస్తుగా నీళ్ళున్నాయి. అదీగాక ఈ చుట్టుపక్కల పాల వ్యాపారం బాగా వుంది కదా! అందుకని పాలపొడుల ఫ్యాక్టరీ పెడతామని భూమిని అమ్ముకొని చానామంది నీ కొడుకు చుట్టూ రోజు వచ్చిపోతున్నారు. ఈడ ఫ్యాక్టరీ పెడితే చానా మందికి ఉద్యోగాలు అయితే వస్తాయి. సంపాదించిన డబ్బులతో కొనడానికి తింటానికి తిండిగింజలు వుండాలి కదా! అది కాదమ్మ గారు. ఈ ఫ్యాక్టరీ వలన బాగా కాలుష్యం వస్తదట. చుట్టుప్రక్కల భూముల్లో కొన్నాళ్ళకు పంటలు పండక బీడు భూములు అవుతాయట. మీలాంటి సదువుకున్నోళ్ళు చెబుతున్నారు. ఆ భూములను ఈ ఫ్యాక్టరీ వాళ్ళే తక్కువ ధరకు కొని, రియల్ ఎస్టేట్‌లుగా మార్చి కాలనీలు కట్టి కోట్లు సంపాయిస్తారు. మా వూరి పేరు పోయి కొత్త పేరు పెడతారు కల్లి.

పని చేసుకుంటూ యిదంతా వింటున్న కృష్ణయ్య వచ్చి అదికాదమ్మగారు మేము బీహారు నుండి వచ్చి ఈడ సంతోషంగా కడుపునిండా కూడు తింటున్నాము. మా వూళ్ళల్లో మాకు కూలికూడ దొరటం లేదు. రోజు గుండాలతో గొడవలు, కేసులు. మా పొలాలు వాటి హద్దులు ఎక్కడ వున్నాయో తెలియదు. ఏ పొలం దున్నుకోవాలో, పండించిన పంట ఎవరు దినాలో చెప్పేది గుండాలు, రౌడీలు. ఆ బాధలు పడలేక వున్నవూరు, భూమి వదిలి ఇంత దూరం వచ్చినాము. మీ భాష కూడా నేర్చుకొని అందరితో కలిసిపోయాము. ఫ్యాక్టరీలు, వ్యాపారం అంటేనే దోపిడి, గూండాయిజం వుంటుంది. అదే రైతు దోపిడి, గుండాయిజం చేయడు. నీవు పోయిన తరువాత ఈ పొలం వల్లకాడు అవుతాది పెద్దయ్య. ఏ కాడికి అమ్మబాకా, కొనటం కష్టం కాని అమ్మటం ఎంతసేపు. భూమి వున్నదంటే పదిమందికి ప్రాణం పోస్తది. అందరూ భూములను అమ్ముకుంటే మాలాంటి వాళ్ళము ఎట్లా బ్రతకాలయ్యా.

వీళ్ల మాటలు వింటుంటే ప్రపంచీకరణ ఫలితాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

చెన్నారెడ్డిగారు మా పట్టు పరిశ్రమ చేపడితే చాలా మందికి ఉపాధి కలిగించవచ్చు. ముఖ్యంగా మహిళలకు మంచి జీవనోపాధి వుంటుంది. మీలాంటి ఆదర్శరైతులు పదిమందికి పని కల్పించిన వారు అవుతారు. అలాగే పట్టుపరిశ్రమ చేపడితే పంటతో పాటు మీ పశువులకు మల్బరి ఆకును గడ్డికి బదులు వేయవచ్చు. పనికి రాని పురుగులను మీకోళ్ళకు బలమైన ఆహారం. పురుగుల పెంట మంచి ఎరువుగా మీ పొలాలకు వాడచ్చు. ఇలా చెప్పుకుంటూపోతే పట్టుపురుగు నుండి చాలా చాలా పొందవచ్చు. మీరు పొలం సాగు చేస్తున్నారు అంటూ చాలా మందికి జీవనోపాధి కల్పించవచ్చు.

నాయుడు కల్పించుకొని అమ్మగారు చెప్పినట్టు నిజమే అనిపిస్తుంది. వేలెడెంతలేని పట్టుపురుగు ఎంతో మేలు చేస్తుంది. అలాంటిది మనుషులమన్నాక నలుగురిని బతికించాలి కదా! కాకపోతే పట్టుబట్టకోసం పట్టు పురుగులను చంపుతున్నాము. నీ పిల్లలు పట్నంలో సుఖమైన జీవితం కోసం నువ్వు చచ్చిపోవాలని అనుకుంటున్నారు. యిక నీ యిష్టం పెద్దయ్య. పాపం ఆ అమ్మగారు పొద్దుకాడనుండి కూర్చొనే వుంది. పట్టు పరిశ్రమ చేస్తామో లేదో చెప్పు.

చెన్నారెడ్డిగారు. నేను వస్తానండి. రెండు రోజులు ఆగి వస్తాను ఆలోచించుకొని ఏ సంగతి చెప్పండి.

× × ×

రెండు రోజుల తరువాత వెళ్ళిన నాకు చెన్నారెడ్డి మొహంలో సంతోషం కనపడింది. నన్ను చూసి చెప్పిన సమయానికి వచ్చారు. తప్పకుండ మీ పంటను వేస్తున్నాను. వరి మడిలో కలుపులు తీస్తున్నారు. మళ్ళీ వస్తాను. నేను వచ్చేటప్పటికి ఈ కాగితాలు చదవండి అని చేతిలో వీలునామా కాగితాలు పెట్టాడు.

ఈ ఆస్థి అంతా నా స్వార్జితం. రెండు ఎకరాలు మాత్రమే పిత్రార్జితం. ఆ రెండు ఎకరాలను చెరొక ఎకరం కొడుకు కూతురికి. మిగిలిన భూమిని తాకట్టు గాని, అమ్మకం గాని జరగరాదు. దీనిపైన వచ్చే ఆదాయంతో ఏమి చేయాలో అని ఒక ట్రస్టును ఏర్పాటు చేస్తున్నాను, ఆ ట్రస్టును మీ ముసలిదాని పేరు పెట్టాలి. ఈ భూమిమీద వచ్చే రాబడి రెండు భాగాలు చేస్తున్నాను. ఒక భాగం నన్ను నమ్ముకొని వచ్చిన కూలీలకు చెందాలి. రెండవ భాగం సామాజిక అభివృద్ధికి అంటూ వృద్ధులకు, అనాధలకు వికలాంగులకు పునరావాసం కల్పించాలి. ఈ ట్రస్టు బాధ్యతను నా చిన్ననాటి ప్రాణమిత్రుడు, బ్రహ్మచారి, జీవితమంతా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తున్న ధర్మారావుకు అప్పగిస్తున్నాను..

చదివిన నాకు ఎక్కడో తెలియని ఆనందం సంతోషంతో పాటు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చెన్నారెడ్డి చెట్టంత మనిషిగా కనబడుతున్నాడు. రెండు చేతులెత్తి నమస్కరించటమే నేను చేయగలపని.

# అంధకారం

ఒరియామూలం: **రాజకిశోర్ దాసు**

తెలుగుసేత: **చాగంటి తులసి**

చెప్పు
చెప్పు
అంధకారమా!
నీకన్నా
అత్యంత ప్రీతిపాత్రులు
నావాళ్ళన్న వాళ్లు
ఎవరైనా ఉన్నారా నాకు!

అంధకారంలో
మునకా, ఈత
భయంతో
కంపిస్తుంది
మనస్సు
వొణుకుతుంది
ఒడలు

లోపలా
బయటా
స్వచ్ఛంగా
ధవళ ధవళంగా
గోచరిస్తుంది
ఒకటి ఏదో!

అంధకారం!
ఎన్నెన్ని వర్ణాలునీవి
అందులో
నిండైన నింపైన
చెరగని వర్ణం
ఆనందం!!